నమస్తే తెలంగాణ
# నిర్మల్
5 | నిజామాబాద్, బుధవారం 6 మార్చి 2024 | NIRMAL

## స్మార్ట్ ఫోన్‌లకు దూరంగా ఉండాలి..

**ఆదిలాబాద్ ఎస్పీ గౌష్ ఆలం**



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న ఎస్పీ గౌష్ ఆలం

ఆదిలాబాద్ రూరల్, మార్చి 5 : చిన్నారులు స్మార్ట్ ఫోన్‌ల వాడకాన్ని తగ్గించేలా అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయడం అభినందనీయమని ఎస్పీ గౌష్ ఆలం అన్నారు. మొబైల్ ఫోన్‌లు అధికంగా వాడడం వల్ల కలిగే అనర్థాలపై మంగళవారం ఆదిలాబాద్ పట్టణంలో నిర్వహించిన అవగాహన ర్యాలీని ఆయన ప్రారంభించారు. చిన్నారులతో పాటు తల్లిదండ్రులు సెల్‌ఫోన్‌ల వాడకాన్ని తగ్గిస్తే ఫలితాలు ఉంటాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ సాయిని రవి, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ టి.మురళి పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులకు భూమిపూజ



భూమిపూజ చేసి పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

ఇచ్చోడ(సిరికొండ), మార్చి 5 : సిరికొండ మండలంలోని పొన్న గ్రామంలో మంగళవారం నూతన గ్రామ పంచాయతీ, అంగన్‌వాడీ భవన నిర్మాణాలకు ఎమ్మెల్యే అనిల్ జాదవ్ భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజలకు మెరుగైన పాలన అందించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామన్నారు. ఏమైన సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని, పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఇచ్చోడ, బోథ్ ఎంపీపీలు నిమ్మల ప్రీతంరెడ్డి, తుల శ్రీనివాస్, మండల కన్వీనర్ ఏనుగు కృష్ణారెడ్డి పాల్గొన్నారు.




సదర్మాట్ ఆయకట్టు నీరు రాక ఎండిన వరి పంటను చూపిస్తున్న రైతు




పంటలు ఎండిపోవడంతో నీళ్లు ఇవ్వాలని రాస్తారోకో చేస్తున్న రైతులు

# ఎండుతున్న పంటలు
# కర్షకుల కన్నీర

## సదర్మాట్ చివరి ఆయకట్టుకు నీరందించాలని రైతుల ఆందోళన

- కాంగ్రెస్ సర్కారు హామీ ఇవ్వడంతోనే పంటలు వేశామని రాస్తారోకో
- ఎమ్మెల్యే బొజ్జు పటేల్, అధికారులకు విన్నవించినా ఫలితం శూన్యం
- కేసీఆర్ సర్కారు హయాంలో నీటి సమస్య లేదు..
- కాంగ్రెస్ ప్రభుత్వంలోనే నీటిగండం మొదలైంది..
- నీరందించి పంటలను కాపాడాలని అన్నదాతల వేడుకోలు

కడెం, మార్చి 5 : నిర్మల్ జిల్లా కడెం మండలంలోని సదర్మాట్ చివరి ఆయకట్టు రైతులు నీరు అందక పంటలు ఎండిపోతున్నాయని మంగళవారం ఆందోళన బాట పట్టారు. యేటా యాసంగిలో లింగాపూర్, మాసాయిపేట, నచ్చన్‌ఎల్లాపూర్, ధర్మాజిపేట, సారంగాపూర్, ఎలగడప, దిల్దార్‌నగర్, పాతమద్దిపడగ, లక్ష్మీసాగర్, కొత్తమద్దిపడగ, పెద్దూర్ గ్రామాల వరకు సదర్మాట్ ద్వారా సాగు నీరు అందేది. ఈ యాసంగిలో దాదాపు 20 వేల ఎకరాల వరకు వివిధ పంటలు సాగయ్యాయి. ఇందులో ప్రధానంగా వరి 17 వేలు, మొక్కజొన్న 3 వేల ఎకరాల్లో సాగైంది. అయితే.. ఈ యాసంగికి సదర్మాట్ కెనాల్ ద్వారా ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జు పటేల్ గత జనవరిలో నీటిని విడుదల చేసి, చివరి ఆయకట్టుకు నీటిని అందిస్తామని హామీ ఇవ్వడంతో రైతులు పంటలు వేశారు. ప్రస్తుతం వరి, మొక్కజొన్న పంటలు పొట్ట దశలో ఉన్నాయి. ఈ తరుణంలో చివరి ఆయకట్టుకు సాగు నీరు అందక పోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. సదర్మాట్ ఆయకట్టు చివరి గ్రామాలైన కొత్తమద్దిపడగ, పాతమద్దిపడగ, లక్ష్మీసాగర్, పెద్దూర్ గ్రామాల్లోని 200 ఎకరాల పంటలు ఎండిపోతున్నాయి. ఎకరం వరికి దాదాపు రూ.40 వేల చొప్పున ఖర్చు చేశారు. మొక్కజొన్నకు దాదాపు ఎకరాకు రూ.10వేలకు పైగా వ్యయం అయింది. ఈ విషయమై నీటి పారుదలశాఖ అధికారులను కలిసి విన్నవించినా సమస్య తీరడం లేదు. అయితే స్వయంగా ఎమ్మెల్యే నీటి పారుదలశాఖ అధికారులకు ఫోన్ చేసి చెప్పినా నీరు ఇవ్వడం లేదు.

### రైతన్నల ఆందోళన

సదర్మాట్ చివరి ఆయకట్టుకు సాగు నీరు విడుదల చేయాలని రైతన్నలు రోడ్డెక్కారు. మంగళవారం ఉదయం 12.30 గంటల నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు కొత్త మద్దిపడగ, పాత మద్దిపడగ, లక్ష్మీసాగర్, పెద్దూర్ గ్రామాలకు చెందిన రైతులు ధర్మాజీపేట సమీపంలోని నిర్మల్-మంచిర్యాల ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. రెండు గంటలపాటు రాస్తారోకో నిర్వహించగా, ఇరువైపుల అర కిలోమీటరు మేర వాహనాలు నిలిచాయి. విషయం తెలుసుకున్న కడెం ఎస్ఐ రాజు ఘటన స్థలానికి చేరుకుని రైతులకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. ఎమ్మెల్యే, కలెక్టర్, అధికారులు రావాలని, నీళ్లు వదులుతామని హామీ ఇచ్చేవరకు ఆందోళన కొనసాగిస్తామని భైఠాయించారు. అధికారుల పనితీరుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం ఘటనా స్థలానికి తహసీల్దార్ సుజాతారెడ్డి చేరుకుని ఈ రోజు నుంచి చివరి ఆయకట్టు వరకు నీటిని అందించేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చినప్పటికీ ఆందోళన విరమించలేదు. తహసీల్దార్ సమాచారంతో నీటి పారుదల శాఖ ఈఈ విఠల్, ఏఈ రవికుమార్‌లు ఘటనా స్థలానికి వచ్చారు. ఈ సందర్భంగా నీటి పారుదలశాఖ అధికారులను రైతులు నిలదీశారు. ఏఈ రవికుమార్‌ను సస్పెండ్ చేయాలని, కొత్త ఏఈని నియమించాలని డిమాండ్ చేశారు. దీంతో ఈఈ విఠల్ చివరి ఆయకట్టు వరకు నీటిని అందించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళన విరమించారు.

### ఎమ్మెల్యే హామీతోనే పంటలు వేశాం.. : రైతులు

సదర్మాట్ ఆయకట్టు రైతులందరం ప్రతి ఎకరా చివరి ఆయకట్టు వరకు నీటిని అందిస్తామని ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జు పటేల్ హామీ ఇవ్వడంతోనే పంటలు వేశామని రైతులు పేర్కొన్నారు. అయితే కాలువలకు నీరు వస్తున్న సంబంధిత ఏఈ రవికుమార్ మా గ్రామాలకు నీరు ఇవ్వడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మిగిలిన గ్రామాల రైతుల వద్ద ఎకరాకు రూ.300 చొప్పున వసూలు చేసి నీటిని మళ్లీస్తున్నారని, 20 రోజులుగా తమ పంటలు ఎండుతున్నాయని మండిపడ్డారు. ఈ విషయమై దాదాపు 50 మందికిపైగా రైతులం ఉట్నూర్ వెళ్లి ఎమ్మెల్యే బొజ్జును కలిసి సమస్యను విన్నవించామన్నారు. అయినప్పటికీ అధికారులు పంటలకు నీరివ్వడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. నీరు రాక పంట ఎండిపోయి బీళ్లుగా మారుతున్నాయన్నారు. గడిచిన పదేళ్ల కాలంలో ఎన్నడు రాని గోస ఈ యాసంగికి వచ్చిందన్నారు. గతంలో తాము పండించిన వరి సాగు చివరి వరకు నీటికి ఢోకా లేకుండే కానీ, గడిచిన 20 రోజుల్లోనే నీటి సమస్య మొదలైందని పేర్కొన్నారు.

### రూ.1.35 లక్షల పెట్టుబడి నష్టపోతా..



నా పేరు రాకేం సదానందం. మాది కడెం మండలంలోని మద్దిపడగ గ్రామం. నాకున్న నాలుగున్నర ఎకరాల్లో పంటలు వేశా. ఇందులో మూడెకరాల్లో వరి, ఎకరంన్నరలో మొక్కజొన్న వేశా. వరి సాగుకు రూ.1.20 లక్షలు, మొక్కజొన్న సాగుకు రూ.15 వేలు ఖర్చయ్యాయి. పంటలు ఇప్పుడు పొట్ట దశలో ఉన్నాయి. నాలుగు తడులు నీరందిస్తే పంట చేతికొస్తుంది. ఈ సమయంలో దాదాపు 20 రోజులుగా కాంగ్రెసోళ్లు, అధికారులు నీరందించడం లేదు. ఇంకా వారం రోజుల్లో నీరు రాకపోతే పంటలను వదిలిపెట్టుడే అవుతది. లాభం ఏమో కానీ పెట్టుబడి కూడా రాకుండా పోతది.

### పదేళ్ల తర్వాత మళ్లీ రోడ్డెక్కినం..



నా పేరు గద్దల దేవన్న. మాది కడెం మండలంలోని పాతమద్దిపడగ గ్రామం. నాకు రెండున్నరెకరాల వ్యవసాయ భూమి ఉంది. ఎకరంన్నరలో వరి, ఎకరంలో మొక్కజొన్న వేశా. దాదాపు రూ.50 వేల వరకు పెట్టుబడి పెట్టా. సాగు నీటి కోసం కేసీఆర్ ప్రభుత్వ హయాంలో ఇబ్బందులు రాలేదు. కానీ.. పదేళ్లకు ముందు ఉన్న రోజులు మళ్లీ వచ్చినయ్. కేసీఆర్ నీటి గోస లేకుండా చూసిండు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ఎండిపోతున్నా కూడా మా గోడును పట్టించుకునే వారు లేరు. స్వయంగా ఎమ్మెల్యే ఫోన్ చేసి అధికారులతో మాట్లాడిన నీరు ఇవ్వడం లేదు. విసిగిపోయి ఈ రోజు రోడ్డెక్కినం.

## ఒకే కాన్పులో ముగ్గురు జననం



ముగ్గురు శిశువులు

నిర్మల్ చైన్‌గేట్, మార్చి 5 : నిర్మల్ మాతా, శిశు ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ఒకే కాన్పులో ముగ్గురు శిశువులకు జన్మనిచ్చిన సంఘటన చోటు చేసుకుంది. వైద్యులు తెలిపిన వివరాల ప్రకారం.. నిర్మల్ జిల్లా ముథోల్ మండలంలోని విటోలి గ్రామానికి చెందిన గర్భిణీ జ్యోతికి పురుటి నొప్పులు రావడంతో సోమవారం రాత్రి నిర్మల్‌లోని మాతా, శిశు ఆరోగ్య కేంద్రానికి వచ్చింది. మంగళవారం వైద్యులు పరీక్షలు చేసి ఆసుపత్రి ఇన్‌చార్జి సరోజ, సీనియర్ సివిల్ సర్జన్ రజని ఆధ్వర్యంలో సాయి సౌమ్య జ్యోతికి శస్త్ర చికిత్స చేశారు. మహిళ ముగ్గురు శిశువులకు జన్మనిచ్చింది. జన్మించిన శిశువులలో ఇద్దరు ఆడ, ఒక మగ శిశువు ఉన్నారు. తల్లి, శిశువులు ఆరోగ్యంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు.

## ఆర్జీయూకేటీ అధ్యాపకులకు ముగిసిన శిక్షణ

బాసర, మార్చి 5 : హైదరాబాద్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థలో జరుగుతున్న ఆర్జీయూకేటీ అధ్యాపకులకు శిక్షణ ముగిసింది. మంగళవారం తెలంగాణ రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ పాల్గొన్నారు. రెండో రోజు కమ్యూనికేషన్, ప్రదర్శన నైపుణ్యాలు అనే అంశంపై ముఖాముఖి నిర్వహించారు. వినడం, నేర్చుకోవడం, స్పష్టం, సంక్షిప్తం, బాడి లాంగ్వేజ్, ఎవరు గౌరవించాలి, గౌరవించబడాలి వంటి అంశాలపై ట్రిపుల్ ఐటీ వీసీ వెంకటరమణ, వివేక్‌మోదీలు అవగాహన కల్పించారు.

## అబ్కారీశాఖ అధికారుల దాడులు

కడెం, మార్చి 5 : జిల్లా అబ్కారీశాఖ ఎస్పీ అబ్దుల్ రజాక్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో మంగళవారం అధికారులు దాడులు నిర్వహించారు. 5 టన్నుల బెల్లం, 3 క్వింటాళ్ల పటిక స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. పాండ్వాపూర్‌కు వెళ్లిన అధికారులకు గుడుంబా విక్రయిస్తున్న ఓ వ్యక్తి దొరకడంతో ఆయనను విచారించగా, గుడుంబా తయారీకి అవసరమైన సామగ్రిని కడెంలో కొనుగోలు చేసినట్లు చెప్పాడన్నారు. అక్కడి నుంచి కడెం చేరుకుని రెండు గోదాముల్లో సోదాలు నిర్వహించగా.. భారీగా బెల్లం, పటిక లభ్యమైందన్నారు. సామగ్రిసహా గోదాములను సీజ్ చేసి,ముగ్గురిపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐ లక్ష్మణ్‌రావు పాల్గొన్నారు.

## కొడుకుకు భారం కాకూడదని..

- ఉరేసుకుని వృద్ధుడి ఆత్మహత్య
- పేదరికం, అనారోగ్యం కూడా కారణం
- భీంపూర్ మండలంలోని పిప్పల్‌కోటిలో ఘటన

భీంపూర్, మార్చి 5 : కుటుంబానికి, కొడుకుకు భారం కాకూడదనే ఆలోచనతో మంగళవారం వృద్ధుడు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. ఆదిలాబాద్ జిల్లా భీంపూర్ మండలంలోని పిప్పల్‌కోటి గ్రామానికి చెందిన అయినవల్లి నర్సిములు-గంగమ్మ దంపతులు కూలీ పని చేసుకుని జీవనం సాగించేవారు. వీరికి రాజన్న, లచ్చన్న ఇద్దరు కుమారులు. వీరికి పెండ్లిళ్లు కూడా అయ్యాయి. రాజన్నకు ఒక కుమారుడు, కూతురు కాగా ఇద్దరికి కూడా పెండ్లిళ్లు అయ్యాయి. లచ్చన్నకు కూడా ఒక కూతురు, కుమారుడు. ఈ క్రమంలో గతేడాది గంగమ్మ కూడా అనారోగ్యంతో మృతిచెందింది. నర్సింలు మాత్రం చిన్న కుమారుడైన లచ్చన్న వద్ద ఉంటున్నాడు. లచ్చన్న కూడా అనారోగ్యంతో ఉన్నాడు. ఏమి పని చేయలేని స్థితిలో ఉండగా.. నర్సింలే కూలీ పనిచేసి కుటుంబాన్ని పోషించేవాడు. ఈ మధ్య నర్సింలు కూడా కీళ్లనొప్పులు అధికం కావడంతో ఏమి పని చేయలేక పోతున్నాడు. కుటుంబానికి, కొడుకుకు భారం కాకూడదని నిర్ణయం తీసుకున్నాడు. మంగళవారం ఉదయం స్థానిక పాఠశాల వెనుక గల చేనులో చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## మోదీ ఎందుకొచ్చినట్టు?

- పెండింగ్ ప్రాజెక్టుల విషయంలో స్పందించ లేదు..
- ఎంపీ, ఎమ్మెల్యేలు ప్రజలకు క్షమాపణ చెప్పాలి..
- ఏ ముఖం పెట్టుకుని ఓట్లు అడుగుతారు..
- మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రామన్న ఆగ్రహం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి జోగు రామన్న

ఆదిలాబాద్, మార్చి 5(నమస్తే తెలంగాణ) : కేంద్ర ప్రభుత్వం పరిష్కరించాల్సిన ప్రాజెక్టుల విషయంలో కనీసం స్పందించని ప్రధానమంత్రి మోదీ జిల్లా పర్యటనకు ఎందుకొచ్చినట్టని మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న ప్రశ్నించారు. మంగళవారం బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా పర్యటనకు 40 సంవత్సరాల తర్వాత ప్రధాని హోదాలో మోదీ రావడంతో ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న అభివృద్ధి పనులకు మోక్షం లభిస్తుందని జిల్లా ప్రజలు ఆశపడ్డారు. కానీ.. పెండింగ్ ప్రాజెక్టుల విషయంలో ప్రధాని ఒక్క మాటైనా మాట్లాడకపోవడంతో నిరాశ, నిస్పృహలకు గురయ్యారన్నారు. సీసీఐ పునః ప్రారంభం, ఆర్మూర్-ఆదిలాబాద్ రైల్వేలైన్, ఎయిర్ పోర్టు ఏర్పాటు, గిరిజన యూనివర్సిటీ, టెక్స్‌టైల్ పార్కు ప్రారంభం విషయంలో మోదీ స్పందించకపోవడం కమలం పార్టీకి జిల్లా అభివృద్ధిపై ఉన్న నిర్లక్ష్యానికి నిదర్శమని మండిపడ్డారు. గతంలో జిల్లా సమస్యల పరిష్కారం విషయంలో కేంద్ర ప్రభుత్వం సుముఖంగా ఉన్నా, బీఆర్‌ఎస్ ప్రభుత్వం సిద్ధంగా లేదని ఆరోపణలు చేసిన బీజేపీ ఎంపీ సోయం బాపురావు, ఎమ్మెల్యే పాయల్ శంకర్ ఇప్పుడు ప్రజలకు ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు. ఆదిలాబాద్ పార్లమెంట్ పరిధిలో నలుగురు బీజేపీ ఎమ్మెల్యేలను గెలిపించినందుకు ప్రధాని మోదీ జిల్లా అభివృద్ధిని విస్మరించి, ఎలాంటి హామీలు ఇవ్వకుండా వెళ్లారని ఆవేదన చెందారు. ఆదిలాబాద్ పర్యటనను బీజేపీ నాయకులు ప్రజల సొమ్ముతో ఎన్నికల ప్రచార సభను ఏర్పాటు చేశారని పేర్కొన్నారు.

### ఎంపీ, ఎమ్మెల్యేలు ప్రజలకు క్షమాపణ చెప్పాలి..

ప్రధాని నరేంద్రమోదీ పర్యటన సందర్భంగా జిల్లాకు ఏదో జరుగుతుందని, సమస్యలు పరిష్కరిస్తారని ఊదరగొట్టు ప్రసంగాలు చేసిన ఎంపీ సోయం బాపురావు, ఎమ్మెల్యే పాయల్ శంకర్‌లు జిల్లా ప్రజలకు క్షమాపణలు చెప్పాలని జోగు రామన్న డిమాండ్ చేశారు. పెండింగ్ ప్రాజెక్టులను మరిచిపోయి, జిల్లా అభివృద్ధిని విస్మరించిన బీజేపీ నాయకులకు ఓట్లు అడిగే హక్కు లేదన్నారు. అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవంలో మోదీ, రేవంత్‌రెడ్డిలు ఒకరినొకరు పొగుడుతూ ఛోటా భాయ్, బడా భాయ్‌లా వ్యవహరించారని.. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు దొందూదొందేనని వ్యాఖ్యానించారు.సోయాబీన్, జొన్నల కొనుగోళ్లను కూడా వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేశాడు. ఈనెల 15వ తేదీ వరకు కొనుగోళ్లు జరుగుతాయని ఉత్తర్వులు వచ్చినా.. స్థానిక ఎమ్మెల్యే కనీసం స్పందించడం లేదని మండిపడ్డారు. గతంలో ప్రతి చిన్న విషయానికి ధర్నాలు చేసి ప్రస్తుతం రైతులను విస్మరించడం సరికాదన్నారు.

### ఆదివాసులకు బీజేపీ అన్యాయం చేస్తున్నది..

ఆదివాసుల అభివృద్ధి కోసం బీజేపీ ఎన్నో పథకాలు అమలు చేస్తున్నదని ప్రధాని ప్రజలను పక్కదోవ పట్టిస్తున్నారని మాజీ మంత్రి జోగు రామన్న మండిపడ్డారు. పార్లమెంట్ ఎన్నికల్లో నలుగురు సిట్టింగ్‌లలో ముగ్గురికి ఎంపీ టికెట్లు ఇచ్చిన బీజేపీ ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపురావు పేరును ఎందుకు తొలిగించారని ప్రశ్నించారు. కేసీఆర్ ప్రభుత్వం రూ.25 కోట్లతో జోడేఘాట్‌లో గిరిజన వీరుడు కుమ్రం భీం మ్యూజియం ఏర్పాటు చేసిందని, కొత్తగా ఏర్పాటు చేసిన జిల్లాకు కుమ్రం భీం పేరును పెట్టినట్లు గుర్తు చేశారు. రూ.100 కోట్లతో హైదరాబాద్‌లో కుమ్రం భీం భవన్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డికి కేసీఆర్‌ను విమర్శించే హక్కు లేదన్న రామన్న, పార్లమెంట్ ఎన్నికల్లో సికింద్రాబాద్ నుంచి ఆయన ఓడిపోతారని జోస్యం చెప్పారు. జిల్లా ప్రజలను అవమానించిన బీజేపీకి లోక్‌సభ ఎన్నికల్లో ప్రజలు ఓటుతో బుద్ధి చెప్పాలని కోరారు. ఈ సమావేశంలో బీఆర్‌ఎస్ నాయకులు రోకండ్ల రమేశ్, విజ్జిగిరి నారాయణ, అలాల అజయ్, లింగారెడ్డి, రాజు, రమేశ్, శివకుమార్, దయానంద్, అశోక్, శివకుమార్, సాయి పాల్గొన్నారు.

## జనం వెంటే ఉందాం..

- ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాడుదాం..
- మాజీ ఎమ్మెల్యే విఠల్ రెడ్డితో బీఆర్‌ఎస్ కార్యకర్తలు



విఠల్ రెడ్డితో మాట్లాడుతున్న తానూర్ మండల బీఆర్‌ఎస్ కార్యకర్తలు

భైంసా టౌన్, మార్చి 5 : జనం వెంటే ఉందామని, ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుదామని తానూర్ మండల బీఆర్‌ఎస్ కార్యకర్తలు మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డితో పేర్కొన్నారు. మంగళవారం భైంసా మండలంలోని దేగాంలో బీఆర్‌ఎస్ కార్యకర్తలతో విఠల్‌రెడ్డి సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్, కేటీఆర్ నాయకత్వంలో అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం పేదల సంక్షేమానికి ఎన్నో పథకాలను ప్రవేశపెట్టిందని గుర్తు చేశారు. ప్రజలలో ఉండి బీఆర్‌ఎస్ పార్టీని బలోపేతం చేద్దామన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు నెరవేర్చకపోతే ప్రజల తరపున పోరాడుదామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో నిర్మల్ జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ సాగరబాయి, డీసీసీబీ డైరెక్టర్ నారాయణ పటేల్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్

## ప్రజాపాలన సేవా కేంద్రాలను వినియోగించుకోవాలి..

- ఎంపీడీవో, మున్సిపాలిటీల్లో ఏర్పాటు చేశాం..
- ఇవీ ఆరు గ్యారెంటీల లబ్ధిదారులకు ప్రయోజనం
- గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం కల్పించాలి..
- వీసీలో నిర్మల్ కలెక్టర్, విద్యుత్ శాఖ కార్యదర్శి రిజ్వాన్

నిర్మల్ టౌన్, మార్చి 5 : ప్రజాపాలన సేవా కేంద్రాలను ఆరు గ్యారెంటీల లబ్ధిదారులు వినియోగించుకోవాలని నిర్మల్ కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ పేర్కొన్నారు. మంగళవారం హైదరాబాద్ నుంచి విద్యుత్‌శాఖ కార్యదర్శి రిజ్వాన్ ఆధ్వర్యంలో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యుత్ శాఖ కార్యదర్శి మాట్లాడుతూ.. అర్హులైన లబ్ధిదారులకు సేవలు అందించేందుకు ఎంపీడీవో, మున్సిపాలిటీల్లో ఏర్పాటు చేశామని తెలిపారు. రేషన్, ఆధార్, గ్యాస్ కనెక్షన్, విద్యుత్ నంబరు వంటి వివరాలను ఆన్‌లైన్ చేయించుకోవచ్చన్నారు. సాఫ్ట్‌వేర్ పనిచేయు విధానంపై రాష్ట్ర టెక్నికల్ బృందం అన్ని జిల్లాల అధికారులకు పవర్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారని తెలిపారు. ఈ సాఫ్ట్‌వేర్ గురించి పల్లెల్లో ప్రచారం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్‌అహ్మద్, జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

### ధరణి అర్జీలను పరిష్కరించాలి..

సోన్, మార్చి 5 : భూ రికార్డుల క్రమబద్ధీకరణ పారదర్శకంగా నిర్వహిస్తూ, ధరణి దరఖాస్తులను సత్వరం పరిష్కరించాలని కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. మంగళవారం నిర్మల్ మండలంలోని కౌట్ల(కె) గ్రామంలోని ధరణి భూ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక క్యాంపెయిన్‌ను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వచ్చిన ఫిర్యాదులు, పరిష్కరించాల్సిన ఫిర్యాదులు, పెండింగ్‌లో ఉన్న ఫిర్యాదులను అడిగి తెలుసుకున్న ఆయన ప్రభుత్వం నిర్దేశించిన గడువులోపు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

## ఇంటర్ పరీక్షలకు 290 గైర్హాజరు

నిర్మల్ అర్బన్, మార్చి 5 : నిర్మల్ జిల్లావ్యాప్తంగా మంగళవారం ద్వితీయ సంవత్సరం(గణితం, బాటనీ, పొలిటికల్ సైన్స్) పరీక్షలను నిర్వహించినట్లు జిల్లా నోడల్ అధికారి పరశురాం తెలిపారు. 6,591 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా.. 6,301 మంది హాజరయ్యారు. 290 మంది గైర్హాజరైనట్లు తెలిపారు.